క్లుప్తంగా...

నేటి నుంచి ఎంజీఐటీలో నిర్వాణ-2023

మణికొండ: ఎంజీఐటీ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో నిర్వాణ-2023 కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు టెక్నికల్ ఫెస్ట్, రెండో రోజు స్పోర్ట్స్ డే, మూడో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభా పురస్కారాలు ఉంటాయని తెలిపారు.

సామాజిక సేవలోనే అసలైన సంతృప్తి



మజ్జిగ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: సామాజిక సేవలో భాగస్వాములైన వారికి ఎంతో సంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణానికి చెందిన వ్యాపారవేత్త కందకట్ల సిద్దురెడ్డి ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణం చేపట్టి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవలో తనవంతు బాధ్యతగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సిద్దురెడ్డి తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, కౌన్సిలర్లు వై.కుమార్ తదితరులున్నారు.

యువత చెడు అలవాట్లకు బానిస కావొద్దు



ద్విచక్ర వాహనాన్ని అందజేస్తున్న శేఖర్‌ముదిరాజ్

బండ్లగూడ: యువత చెడు అలవాట్లకు బానిస కావొద్దని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని కిస్మత్‌పూర్ దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ ఉపసర్పంచ్ నిరుడు శేఖర్‌ముదిరాజ్ సూచించారు. గ్రామానికి చెందిన హరీష్‌కు ద్విచక్ర వాహనం కొనుగోలు చేసుకునేందుకు ఆయన సాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత తమ కాళ్లపై నిలబడేందుకు తాను ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. నలుగురికి ఆదర్శంగా ఉండాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జాతీయ రహదారి పీరంచెరువు కమాన్ సమీపంలోని ధ్యాన మనోప్రస్థానం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం ప్రస్థానం ప్రతినిధులు మాట్లాడుతూ.. వేసవిలో రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్నందున ప్రజల దాహార్తిని తీర్చేందుకు గురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో నగరంలోని ప్రధాన కూడళ్లల్లో 25 చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బాటసారులు, వాహనదారులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజేంద్ర, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, మురళీకృష్ణ, అరుణ, పద్మజ్యోతి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కిటెక్చర్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండు

విజయనగర్‌కాలనీ: ఆర్కిటెక్చర్ విద్యార్థులకు దేశ విదేశాలలో అపారమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని జేఎన్ఏఎఫ్ఏయు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత దరియానిరావు అన్నారు. బుధవారం మాసబ్ ట్యాంక్‌లోని ప్రభుత్వ ఆర్కిటెక్చర్ కళాశాలలో ఐదురోజుల పాటు కొనసాగే అర్బన్ రీజినల్ ప్లానింగ్ ఎగ్జిబిషన్‌ను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. నగరాలు విస్తరించడం మంచిదే కానీ ఇవి క్రమ పద్ధతిలో ప్రణాళికబద్ధంగా నిర్మిస్తే వానలు, వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు, ఇతర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నష్టనివారణ చేయవచ్చన్నారు. ఆర్కిటెక్చర్, ప్లానింగ్, బీ డిజైనింగ్, బిల్డింగ్ టెక్నాలజీ, సర్వీస్ ప్లానింగ్ తదితర కోర్సులు చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆలోచింప చేశాయి. ప్రకృతి విపత్తుల నుంచి తప్పించుకునే విధానాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్, కో ఆర్డినేటర్ డాక్టర్ శివాంగి నారాయణ్ వాగ్రే, తౌసిఫ్ ఇక్బాల్, ఎస్.రాజు, కృష్ణకిశోర్‌తో పాటు యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఇది ప్రధాన రోడ్డే !



శ్రీదేవి కళాశాల సమీపంలో ఇలా..

రెండు నియోజకవర్గాలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డును కలిపే ప్రధాన రోడ్డు, గతంలో ఉన్న చిన్న రోడ్డును విస్తరించి ప్రయాణికులకు మరింత సౌకర్యంగా చేస్తామన్న ప్రభుత్వ పెద్దలు అట్టహాసంగా 2017లో పనులను ప్రారంభించారు. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు ఇవ్వక పోవటంతో పనులను నిలిపివేశాడని ఆరోపణలున్నాయి.

- పనులను నిలిపివేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు

మణికొండ: రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డు ఎక్కడికక్కడ కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయేలా తయారైంది. రోడ్డుపై అడుగుల లోతు గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

☛ శేరిలింగంపల్లి నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్లే గోపన్‌పల్లి తాండ, వట్టినాగులపల్లి మీదుగా గతంలో ఉన్న చిన్న రోడ్డును 100 అడుగుల మేర విస్తరణతో రేడియల్ రోడ్డుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించి పనులను చేపట్టారు. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవటంతో పనులు నిలిచిపోయాయి. ఏళ్ల తరబడి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఇటీవల కాంట్రాక్టర్ పనులను నిలిపేసి పత్తా లేకుండా పోయాడని స్థానికులు వాపోతున్నారు.

వర్షంతో రాకపోకలకు ఇబ్బందులు..

☛ విప్రో ఉద్యోగులు, శ్రీదేవి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులతో పాటు రాకపోకలు సాగించే ఖానాపూర్, వట్టినాగులపల్లి, శేరిలింగంపల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు పనులకు నిధులను కేటాయించి సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేయించాలని కోరుతున్నారు.



వర్షం కారణంగా కొట్టుకుపోయిన రోడ్డు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పత్రాల పంపిణీ



ఇళ్ల పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని హమీదుల్లానగర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్ ఇళ్ల పత్రాలను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలోని గూడులేని పేదల కోసం నిర్మించిన గృహ సముదాయంలోని ఇళ్లను 20 మందికి కేటాయించగా.. రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హామీ మేరకు పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించినట్లు తెలిపారు. సర్పంచ్ సతీష్‌కుమార్, చిన్న గోల్కొండ సొసైటీ చైర్మన్ దానాకర్‌గౌడ్, ఎంపీపీ జయమ్మ, వైఎస్ఎంపీపీ నీలం, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాసనాలు ప్రజలకు అందుబాటులోకి రావాలి



మంచిరేవులలో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మణికొండ: పార్లమెంట్, అసెంబ్లీలలో చేస్తున్న శాసనాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పుడే ప్రజాస్వామ్యాన్ని రక్షించే అవకాశం ఉంటుందని సీపీఐ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పుస్తకాల నర్సింగ్ రావు అన్నారు. కేంద్ర పార్టీ పిలుపు మేరకు చేపట్టిన 'మోడీ హటావో- దేశ్‌కు బచావో' కార్యక్రమం బుధవారం నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 75 ఏళ్ల స్వతంత్ర దేశంలో పేదవారు పేదవారిగానే ధనికులు ధనికులు ధనికులు గానే మిగిలిపోతున్నారన్నారు. గత 9 ఏళ్ల కేంద్ర పరిపాలనలో నోట్లరద్దు, జీఎస్టీ అమలు, పెట్రోల్ ధరల పెంపు చేసి ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు తమ పార్టీ నిర్విరామ పోరాటం చేస్తుందన్నారు. ఏఐటీయూసీ కార్యదర్శులు మల్లేష్, జైపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు శంకరయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కిషోర్, మండల కార్యదర్శి బాబురావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి సత్యం స్వామి, నాయకులు శ్రీనివాసులు, రాము, రమేష్, నాగరాజు తదితరులున్నారు.

గుప్త నిధుల కలకలం !



యువకులు తీసిన పాము ఫోటో



ముషక్‌మహల్ కింది భాగం

రాజేంద్రనగర్: అత్తాపూర్ ముషక్‌మహల్‌లో బుధవారం గుప్తనిధుల కలకలం రేగింది. స్థానిక ప్రాంతాలకు చెందిన యువకులు తమ సెల్‌ఫోన్స్‌లో రీల్స్ చేసేందుకు ఈ ముషక్‌మహల్‌లోకి వెళ్లి సెల్‌ఫోన్‌లలో చిత్రీకరిస్తుండగా.. గుప్త నిధుల కోసం తవ్విన గోతిలో పాము కనిపించిందని దానిని షూట్ చేసి సోషల్ మాధ్యమంలో పోస్టు చేశారు. నిమిషాల వ్యవధిలో ఈ పోస్టు వైరల్‌గా మారింది. రాజేంద్రనగర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌లో చారిత్రాత్మకమైన ముషక్‌మహల్ కట్టడం ఉంది. ఈ కట్టడం చుట్టూ ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్లు, పొదలతో దట్టంగా ఉంది. ఇందులోకి ఎవరు ప్రవేశించకుండా చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు.

- వివాదంలో భూమి ఉండటంతో అటుగా ఎవరు వెళ్లరు. గతంలో ఈ ముషక్‌మహల్ నుంచి గొల్కొండ కోటకు వెళ్లే వారని స్థానికులు కథలుగా చెప్పుకుంటారు. పురాతన భవనం కావడంతో పాడుబడ్డట్లు ఉండడంతో గతంలో ఇందులో రెండు హత్యలు సైతం జరిగినట్టు సమాచారం.
- రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అందరిని పంపించి వేశారు. ఎలాంటి గుప్త నిధులు లేవని తవ్వకాలు సైతం జరగలేదన్నారు. పురాతన కట్టడం ఉండడంతో పాటు చుట్టూ చెట్లు, గడ్డి ఉండడంతో పాములు సైతం ఉంటాయని యువకులు వాటిని చిత్రీకరించినట్లు పోలీసులు వివరించారు.

డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి గురు సత్కారం



డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి గురు సత్కారం చేస్తున్న దృశ్యం



మద్దాళి ఉషా గాయత్రి శిష్యురాళ్ల నృత్య ప్రదర్శన దృశ్యం

నాంపల్లి: నృత్య కిన్నెర హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో హంస పురస్కార గ్రహీత, నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి బుధవారం రాత్రి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా మందిరంలో శిష్యురాళ్లచే గురు సత్కారం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ సత్కార సభకు ముఖ్యఅతిథిగా తెలుగు వర్సిటీ పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్.గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా నృత్య కళాకారులు, డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి శిష్యురాళ్లు శ్రీవాణి భవానీ, నీరజ, లక్ష్మిశ్రీ, ఉజ్వల, శ్రావ్య, తన్మయి, శర్వాణి, అనసూయ, గాయత్రి, గీతాలి, నూత్న, అనన్య, రసజ్ఞచే నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి ఘనంగా గురు సత్కారం చేశారు. సభా ప్రారంభంలో నృత్య కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు రసవత్తరంగా సాగాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత కళాకృష్ణ, తెలుగు వర్సిటీ నృత్య శాఖ అధిపతి డాక్టర్ వనజా ఉదయ్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ అనగాని మంజుల పాల్గొన్నారు.

నిరసన తెలిపిన ఉద్యోగుల తొలగింపు!

రాజేంద్రనగర్: తమ డిమాండ్ల సాధన కోసం విద్యుత్ శాఖ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మంగళవారం సమ్మెకు దిగిన హెచ్ 82, ఏతే హాద్ సంఘాలకు చెందిన ఆరుగురుని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా జోన్ ఆపరేషన్స్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. అత్యవసర విధులైన విద్యుత్ శాఖలో నిబంధనలకు విరుద్ధంగా సమ్మెకు దిగడంతో ఎస్మా చట్టాన్ని ఉపయోగించి వీరిని పనుల నుంచి తొలగించినట్లు సమాచారం. ఉద్యోగాల నుంచి తొలగించిన వారిలో రాజేంద్రనగర్ డివిజన్ కాటేదాన్‌కు చెందిన బి.అనిల్‌కుమార్, గగన్‌పహాడ్‌కు చెందిన ఎండీ ఖాజాపాషా, సిద్దయ్యలతో పాటు కందుకూరుకు చెందిన కడారి శ్రీశైలం, ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, మొగిలిగిద్దకు చెందిన కోట మల్లేష్, భాసిత్, రాజు ఉన్నారు.

నియామకం

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ శాఖ నూతన అధ్యక్షుడిగా అక్షయ్ అంగుల్‌వార్, కార్యదర్శిగా ఆకాశ్‌భాటిలను నియమించారు. ఈ విషయాన్ని బుధవారం ఏబీవీపీ హెచ్‌సీయూ మాజీ అధ్యక్షురాలు నమ్రతాసింగ్ వెల్లడించారు. వర్సిటీ క్యాంపస్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ఏబీవీపీ జాతీయ జాయింట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలకృష్ణ వీరి నియామకాన్ని ప్రకటించారని చెప్పారు. నూతన అధ్యక్షుడు అక్షయ్ అంగుల్‌వార్, కార్యదర్శి ఆకాశ్‌భాటిలను నమ్రతాసింగ్‌తో పాటు పలువురు ఏబీవీపీ జాతీయ, రాష్ట్ర, హెచ్‌సీయూ నాయకులు అభినందించారు.

ఆలయంలోకి వరద నీరు



తుల్జాభవానీ ఆలయంలోకి చేరిన వరద నీరు

శేరిలింగంపల్లి: తారానగర్‌లోని తుల్జాభవానీ ఆలయంలోకి వరద నీరు చేరింది. మంగళవారం రాత్రి కురిసిన కండపోత వర్షానికి వచ్చిన వరద నీరు ఆలయం ముందు భాగంలో భారీగా చేరింది. అక్కడ నుంచి వరద తుల్జా భవానీ ఆలయంలోకి ప్రవాహం కొనసాగింది. దీంతో ఆలయంలోకి వరదతో పాటు చెత్తాచెదారం కూడా చేరింది. వరదనీరు ఆలయంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

మంత్రి కేటీఆర్‌కు జ్ఞాపిక అందజేత

అబిడ్స్: మంత్రి కేటీఆర్‌కు బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కొమ్ముల నరేందర్ జ్ఞాపికను అందజేశారు. సచివాలయం, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భారీ విగ్రహంతో కూడిన జ్ఞాపికను మంత్రి కేటీఆర్‌కు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరును నామకరణం చేయడం దేశంలోనే రికార్డు అని చైర్మన్ కొమ్ముల నరేందర్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కృతజ్ఞత సభను పెద్ద ఎత్తున నిర్వహించడం గర్వకారణమన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ నేతలు

రాజేంద్రనగర్: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు దేవేందర్ అన్నారు. బుధవారం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుదర్శన్‌గౌడ్, నర్సింహులు ఆధ్వర్యంలో రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గత 25 ఏళ్ల నుంచి జర్నలిస్టులు అనేక కష్ట నష్టాలను ఓర్చుకుని వృత్తిని కొనసాగిస్తున్నారన్నారు.

- రాష్ట్ర ఏర్పాటు అనంతరం కూడా జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడటం ఆందోళన కలిగిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రం ఏర్పడిన తరువాత జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని అనేక వేదికల మీద మీడియా సమావేశాల్లో అనేక సార్లు హామీ ఇచ్చారని తెలిపారు.
- మంత్రులు కూడా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇటీవల కాలంలో అనేకసార్లు హామీ ఇచ్చారన్నారు.
- ఇచ్చిన హామీల మేరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిచ్చిందన్నారు. దీనిలో భాగంగానే రాజేంద్రనగర్, గండిపేట్ తహసీల్దార్లకు వినతిపత్రాలను అందజేశామన్నారు. యూనియన్ ఉపాధ్యక్షులు బుచ్చన్న, ఎం.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మాధవచారి, కార్యవర్గ సభ్యులు మద్దూరి శ్రీనివాస్, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: తెలంగాణ ఉద్యమంలో అనేక పార్టీల నాయకుల కంటే అధికంగా జాతిని జాగృతం చేయటంతో పాటు యాజమాన్యాలు అడ్డు చెప్పినా తెగించి రాష్ట్ర సాధనకు పోరాటం చేసిన జర్నలిస్టులకు రాష్ట్రం వచ్చి 8 ఏళ్లు దాటినా కనీసం ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవటం విడ్డూరమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్ వాపోయారు. బుధవారం గండిపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ.. వినతిపత్రం అందచేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ఉపాధ్యక్షులు బుచ్చన్న, శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మాధవచారి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అలకాపూర్ సమస్యలను పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన అలకాపూర్ నూతన కార్యవర్గం

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు, పార్కుల అభివృద్ధి లాంటి పనులను సకాలంలో చేపట్టి సమస్యలను పరిష్కరించాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డిలను టౌన్‌షిప్ సభ్యులు కోరారు. బుధవారం వారికి వినతిపత్రాలను అందజేసి సమస్యల పరిష్కరించాలన్నారు. నూతన కార్యవర్గంగా తమను ఎన్నుకున్న టౌన్‌షిప్ వాసుల ఆశలను వమ్ము చేయకుండా అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం అధిక పనులు టౌన్‌షిప్‌లోనే కొనసాగుతున్నాయన్నారు. మిగిలిన మరికొన్ని పనులను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి జయప్రకాష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్

రాజేంద్రనగర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటికి ప్రణాళిక రూపొందించి త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్ అన్నారు. బుధవారం బుద్వేల్‌లో ఆమె స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కోరని రవీందర్, దేవదాస్, గౌతమ్ తదితరులు రోడ్లు, డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించి నామె సమస్యలను జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. దశల వారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని వెంటనే రోడ్లు, డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ తదితర వాటి నిర్వహణ కోసం టెండర్లను పిలిపించి పనులను పూర్తి చేస్తామన్నారు.

సీబీఐటీలో మేధో సంపత్తి దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి

మణికొండ: సీబీఐటీ కళాశాలలో మేధో సంపత్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆన్‌లైన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ పేటెంట్ అటార్నీ తపన్ బ్రహ్మ హాజరై మాట్లాడారు. దేశానికి నూతన ఆవిష్కరణల అవసరం ఎంతో ఉందని ప్రతి విద్యార్థి తమ పరిధి దాటి వాటి గురించి ఆలోచనలు చేయాలని వివరించారు. మన మేధో సంపత్తి, చదువు, పరిశ్రమలకు మధ్య వారదిగా పనిచేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది మహిళలు, మేధో సంపత్తి, ఆవిష్కరణ, సృజనాత్మకతను వేగవంతం చేయటం అనే అంశంపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. సీబీఐటీ ఐపీఆర్‌లో 19 గ్రాంట్లు, 39 ప్రచురణలను సాధించిందని కళాశాల ఐఅండ్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉమాకాంత్ చౌదరి అన్నారు.

రఘునాథ్ ఫౌండేషన్ క్రికెట్ టోర్నీ విజేత 'కొత్తగూడ'



కొత్తగూడ జట్టుకు లక్ష నగదు, ట్రోఫీ అందిస్తున్న రఘునాథ్ యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: రఘునాథ్ ఫౌండేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో కొత్తగూడ టీమ్ విజేతగా నిలిచి రూ. లక్ష నగదు అందుకుంది. కొండాపూర్‌లోని ఫయాజ్ క్రికెట్ అకాడమీలో కొద్ది రోజులుగా టోర్నమెంట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దాదాపు 52 టీమ్‌లు ఈ టోర్నీ పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ కొత్తగూడ, వీఎస్‌పీ టీమ్‌ల మధ్య జరిగింది. విజేతగా నిలిచిన కొత్తగూడ జట్టుకు రూ.లక్ష చెక్, రన్నర్‌గా నిలిచి వీఎస్‌పీ జట్టుకు రూ.50 వేల చెక్‌లను రఘునాథ్ ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ అందించారు. నాలుగు, ఐదో స్థానంలో నిలిచిన జట్లకు రూ.25 వేలు అందజేశారు. ఉత్తమ బ్యాట్స్‌మెన్, ఉత్తమ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది టోర్నీ లను జ్ఞాపికలను అందజేశారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న టీమ్‌లకు బ్యాట్ అందజేశారు. రాజకీయాలకు అతీతంగా టోర్నమెంట్ నిర్వహించామని, ప్రతిభను చాటేందుకు క్రికెటర్లు ఉపయోగించుకోవాలని రఘునాథ్ యాదవ్ సూచించారు. కార్యక్రమంలో మాజీ క్రికెటర్ ఫయాజ్, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్, బీజేపీ నాయకులు మొవ్వా సత్యనారాయణ, నరేష్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

గోల్కొండ: గోల్కొండ ఒవైసీ ప్లే గ్రౌండ్‌లో పూర్తి స్థాయి స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తెచ్చామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన బల్దియా వారు ఏర్పాటు చేసిన ఈత కొలనును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం ఈ స్విమ్మింగ్ పూల్‌ను మజ్లిస్ శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రారంభించడం జరిగిందన్నారు. అయితే కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన కారణంగా ఈ స్విమ్మింగ్ పూల్‌ను రూ.2 కోట్లతో మళ్లీ సిద్ధం చేశామన్నారు. ఇక్కడికి వచ్చే ఔత్సాహిక వారికి అన్ని సౌకర్యాలు కల్పించామని ఆయన అన్నారు. పాఠశాలల విద్యార్థులు సైతం ఈత నేర్చుకోవాలని ఆయన సూచించారు. బాలబాలికల కోసం ప్రత్యేక సమయాలు కేటాయించాలని తాను స్విమ్మింగ్ కోచ్‌లను కోరామన్నారు.